క్లుప్తంగా

గోవింద క్షేత్రంలో నేటి నుంచి వార్షిక బ్రహ్మోత్సవాలు


గోవింద క్షేత్రంలో స్వామివారు

రాజమహేంద్రవరం సిటీ: లాలాచెరువులో త్రిదండి శ్రీరామచంద్ర రామానుజ జీయర్ స్వామి ప్రతిష్ఠించిన గోవింద క్షేత్రంలో గురువారం నుంచి 14వ వార్షిక బ్రహ్మోత్సవాలు నిర్వహించనున్నారు. ఈ విషయాన్ని నిర్వాహకులు మట్టపల్లి రంగప్రసాద్, మట్టపల్లి రామ్ కుమార్, మట్టపల్లి సురేష్ కుమార్ బుధవారం తెలిపారు. 13 ఏళ్లుగా నిత్యోత్సవ, పక్షోత్సవ, మాసోత్సవ, పవిత్రోత్సవ, అధ్యయనోత్సవ, కళ్యాణోత్సవాది వివిధ వివిధ ఉత్సవాలను అత్యంత శోభాయమానంగా నిర్వహిస్తున్నమన్నారు. గోవింద క్షేత్రాధీశుడి వార్షికోత్సవాలను గురువారం నుంచి ఈనెల 9 వరకూ అత్యంత వేడుకగా జరుపుతామన్నారు. 10వ తేదీన తదీయారాధన నిర్వహిస్తున్నామని, భక్తులు తరలి వచ్చి తీర్థప్రసాదాలు స్వీకరించాలని కోరారు.

పంచముఖ అవతారంలో హనుమాన్


పంచముఖ అవతారంలో ప్రసన్నాంజనేయస్వామి

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): హనుమజ్జయంతి ఉత్సవాలలో భాగంగా రాజమహేంద్రవరం ఐదుబళ్ల మార్కెట్ సెంటర్‌లోని ప్రసన్నాంజనేయస్వామి ఆలయంలో స్వామివారిని బుధవారం పంచముఖ అవతారంలో అలంకరించారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి స్వామిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. వర్తకులు, రైల్వే ఉద్యోగులు, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

శివాలయంలో ప్రత్యేక పూజలు

ప్రకాశం నగర్: మాస శివరాత్రి సందర్భంగా చందన రమేష్ దంపతులు, చందన నాగేశ్వరరావు దంపతులు బుధవారం స్థానిక శివాలయంలోని పార్వతి అమ్మవారికి అభిషేకం నిర్వహించారు. అనంతరం గోదావరి పూజ, గోపూజ, ప్రాకార దేవతలకు అర్చన, అభిషేకాలు జరిపారు. అనంతరం పార్వతి అమ్మవారికి లక్ష కుంకుమార్చన చేశారు. వారికి పండితులు వేద ఆశీర్వచనం అందజేశారు.

జూలై 20న ఆర్యాపురం బ్యాంక్ ఎన్నికలు

రాజమహేంద్రవరం సిటీ: రాజమహేంద్రవరంది ఆర్యాపురం కోఆపరేటివ్ అర్బన్ బ్యాంకు పాలక వర్గ ఎన్నికలు జూలై 20వ తేదీన నిర్వహించనున్నట్లు కలెక్టర్ డాక్టర్ కె.మాధవీలత తెలిపారు. ఈ మేరకు బుధవారం ఎన్నికల నోటిఫికేషన్ జారీ చేశారు. ఎన్నికల అధికారిగా కొవ్వూరు డివిజనల్ సహకార అధికారి వి.కృష్ణకాంత్‌ను నియమించారు. ఎన్నికల షెడ్యూల్ ప్రకారం జూలై 8న నామినేషన్ల స్వీకరణ, 13వ తేదీన ఉపసంహరణ, 20న ఎన్నికలు జరుగుతాయి. అర్హత గల ఓటర్ల తుది జాబితాను కారం జూలై 4వ తేదీన ప్రకటించనున్నారు.

మలేరియాపై ప్రజలకు అవగాహన కల్పించాలి

కంబాలచెరువు: మలేరియా వ్యతిరేక మాసోత్సవాలపై కంబాలపేటలో బుధవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ హరిబాబు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ రానున్న వర్షా కాలంలో కీటక జనిత వ్యాధులు ప్రబలే అవకాశం ఉందన్నారు. ఈ నేపథ్యంలో వైద్య, ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో జిల్లాలో మలేరియా వ్యతిరేక మాసోత్సవాలు ప్రారంభించామన్నారు. ప్రజలకు మలేరియాపై విస్తృత అవగాహన కల్పించాలని వైద్య సిబ్బందికి సూచించారు. ప్రతి పీహెచ్‌సీ, సబ్ సెంటర్, విలేజ్ వార్డ్ సచివాలయం పరిధిలో బ్యానర్లు ఏర్పాటు చేయాలన్నారు. ఫ్రైడే డ్రై డే కార్యక్రమాన్ని పగడ్బందీగా నిర్వహించాలని సూచించారు. పాత టైర్లు, వాడేసిన కొబ్బరి బొండాలలో నీరు నిల్వ లేకుండా చూడాలని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకొనేలా ప్రజలకు అవగాహన కలిగించాలన్నారు. కార్యక్రమంలో ఎంఎంవో వెంకటేశ్వరరావు, ఎస్‌యూవో కల్నల్ సింగ్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

చంద్రశేఖరస్వామికి అభిషేకాలు

రంగంపేట: చంద్రేడులో కొలువైన శ్రీకాత్యాయనీ సమేత చంద్రశేఖరస్వామి వారికి బుధవారం మాస శివరాత్రి సందర్భంగా అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించినట్టు ఆలయ అర్చకుడు మైలవరపు కష్ణశర్మ తెలిపారు. తెల్లవారు జామున 6 గంటల నుంచి అభిషేకాలు ప్రారంభించి, అనంతరం స్వామివారిని విశేష అలంకరణలు చేసి ప్రత్యేక పూజలు నిర్వహించినట్టు ఆయన తెలిపారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

భగవంతుని స్మరణకు భాషాభేదం లేదు


అనుగ్రహ భాషణం చేస్తున్న ఆనంద తీర్థాచార్యులు

- స్వామి సేవలో పాల్గొనడం పూర్వజన్మ సుకృతం
- దాస సాహిత్య ప్రత్యేక అధికారి ఆనంద తీర్థాచార్యులు
- ముగిసిన శిక్షణ తరగతులు

సీటీఆర్ఐ: భగవంతుని స్మరించడానికి భాషాభేదం లేదని, ఏ భాషలో స్మరించినా ఆయన అనుగ్రహిస్తారని దాస సాహిత్య ప్రత్యేక అధికారి విద్వాన్ పగడాల ఆనంద తీర్థాచార్యులు అన్నారు. స్థానిక తిరుమల తిరుపతి దేవస్థాన కల్యాణ మండపంలో మూడు రోజులుగా జరుగుతున్న దాస సాహిత్య వాగ్గేయ కారుల కీర్తనల శిక్షణ కార్యక్రమం బుధవారంతో ముగిసింది. ఈ సందర్భంగా ఆనంద తీర్థాచార్యులు భక్తులకు అనుగ్రహభాషణం చేశారు. ఆయన మాట్లాడుతూ స్వామి వారిపై అనేక మంది వాగ్గేయకారులు సంకీర్తనలు రచించి, ఆలపించి ధన్యులయ్యారన్నారు. వారిలో కన్నడనాట పురంధర దాసులు ఒకరని, ఆయన స్వామివారిపై 4.75 లక్షల కీర్తనలు రాసి, వేంకటేశ్వరస్వామి పాదపద్మాలకు సమర్పించారన్నారు.

దాస సాహిత్య స్థాపన

దాస సాహిత్య ప్రాజెక్టు స్థాపన వెనుక ఒక ఆసక్తికర సంఘటన ఉంది. 1972లో తిరుమలలో తెల్లవారు జామున గడ్డకట్టే చలిలో కొందరు భక్తులు కోనేరులో స్నానం చేసి కీర్తనలను ఆలపిస్తున్నారు. ఎంతో శ్రావ్యంగా ఉన్న వాటిని అప్పటి ఆలయ ఈఓ టీఆర్‌కే ప్రసాద్ విని ఆశ్చర్యానికి గురయ్యారు. ఆ భక్తులను పిలిచి కీర్తనల విషయం అడిగారు. వారు మాట్లాడుతూ కన్నడ భాషలో స్వామి వారిని వర్ణిస్తూ అనేక మంది కీర్తనలు రచించారని, వాటిని మేము ఆలపిస్తున్నామని తెలియచేశారు. సంగీతానికి భాషతో సంబంధం లేదు అని తలచిన ఆలయ ఈఓ.. ఈ కీర్తనలు ఇక్కడ వారు అభ్యసించి స్వామి వారి కోసం ఆలపించాలని తలంపుతో ఏడు సాహిత్య ప్రాజెక్టులను ప్రారంభించారు. అందులో దాస సాహిత్య ప్రాజెక్టు ఒకటి. దీనిద్వారా పురంధర దాసులు రచించిన సంకీర్తనలను దేశమంతా వ్యాప్తి చేయాలని సంకల్పించారు. తాళపత్ర గ్రంథాలలో లభ్యమైన కీర్తనలను రాగయుక్తంగా ఆలపించి వాటిని రికార్డ్ చేశారు. వీటిపై ఏటా రాష్ట్రంలో రాజమహేంద్రవరంలో మరి కొన్నిచోట్ల శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.

13 ఏళ్లుగా..



గత 13 ఏళ్లుగా క్రమం తప్పకుండా శ్రీవారి బ్రహ్మోత్సవాలలో రాజమహేంద్రవరం భజన మండలి నుంచి కీర్తనకారులను, నవ దుర్గలు, వేంకటేశ్వరస్వామి తదితర వేషధారణలతో బ్రహ్మోత్సవాలలో పాల్గొంటున్నాం. ఇప్పుడు జరుగుతున్న తరగతుల ద్వారా సుమారు వెయ్యి మందికి సంకీర్తనలలో శిక్షణ ఇవ్వడం జరిగింది.

– మంచిరాజు హేమలత, దాస సాహిత్య ప్రాజెక్ట్ నగర నిర్వాహకురాలు

భక్తి భావం పెరుగుతుంది



సంకీర్తనల ద్వారా భక్తి భావం పెంపొందించుకోవచ్చు. చాలా మంది వాగ్గేయ కారులు తమ సంకీర్తనల ద్వారా స్వామి వారి అనుగ్రహం పొందారు. దాస సాహిత్య ప్రాజెక్టు ద్వారా సంకీర్తనలు నేర్చుకొని గత 16 సంవత్సరాలుగా శిక్షణ అందిస్తున్నాను.

– ఆర్‌జే పరిమళ, కర్నూలు, దాస సాహిత్య కోఆర్డినేటర్

స్వామి వారి అనుగ్రహం



సంకీర్తనల ద్వారా స్వామి వారి అనుగ్రహం సులభంగా లభిస్తుందని పురంధర దాసులు తెలిపారు. ఆయన మార్గంలోనే సంకీర్తనలతో స్వామి వారి సేవకు చేరువయ్యాను. సుమారు 250 సంకీర్తనలు గానం చేయగలను. వాటిని ఇతరలకు శిక్షణ ద్వారా నేర్పించగలుగుతున్నాను.

– వైష్ణవి, బెంగళూరు

స్వామి వారి సేవలో..



16 ఏళ్లుగా దాస సాహిత్య ప్రాజెక్టులో భాగంగా మారాను. అప్పటి నుంచి నిరంతరాయంగా కీర్తనలను నేర్చుకుని ఆలపిస్తున్నాను. సాహిత్య రాజధాని రాజమహేంద్రవరంలో పాల్గొనడం చాలా ఆనందంగా ఉంది. మూడు రోజులుగా కీర్తనలలో శిక్షణ ఇవ్వడం జరిగింది.

– జోత్స్న లక్ష్మి, హైదరాబాద్

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

- డీఎస్‌ఈఓ వాసుదేవరావు
- ఘనంగా పర్యావరణ దినోత్సవం

రాజమహేంద్రవరం రూరల్: పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని జిల్లా పాఠశాల విద్యాశాఖాధికారి కె.వాసుదేవరావు అన్నారు. శాటిలైట్ సిటీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం నిర్వహించిన పర్యావరణ దినోత్సవంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వాతావరణంలో పెను మార్పులు సంభవిస్తున్నాయని, అధిక ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయన్నారు. అందుకు పచ్చదనం తగ్గిపోవడమే కారణమని, ప్రతి ఒక్కరూ కనీసం ఒక్క మొక్కనైనా నాటి పెంచాలన్నారు. అనంతరం విద్యార్థులతో పర్యావరణ ప్రతిజ్ఞ చేయించారు. పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. జిల్లా సమగ్ర శిక్షా అడిషనల్ ప్రాజెక్టు కో ఆర్డినేటర్ ఎస్.సుభాషిణి మాట్లాడుతూ విద్యార్థులందరూ పర్యావరణంపై అవగాహన కలిగి ఉండాలన్నారు. ఏఎంఒ గౌరీశంకర్, సీఎంఒ శ్రీనివాస్, జిల్లా సైన్స్ ఆఫీసర్ జీవీఎస్ఎస్ నెహ్రూ, ఐఈ కో ఆర్డినేటర్ కనకబాబు పాల్గొన్నారు.

జవహర్ వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో..

సీటీఆర్ఐ: జవహర్ వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో బుధవారం స్థానిక వెంకటేశ్వర నగర్‌లో అంతర్జాతీయ పర్యావరణ దినోత్సవం నిర్వహించారు. పర్యావరణ పరిరక్షణకు కృషి చేస్తున్న డాక్టర్ జీవీఎస్ నాగేశ్వరరావును క్లబ్ అధ్యక్షుడు ఉండవల్లి సత్యనారాయణ ఆధ్వర్యంలో సత్కరించారు. పర్యావరణ రక్షణలో యువత భాగస్వాములు కావాలని ఆయన పిలుపునిచ్చారు. కార్యక్రమంలో డాక్టర్ కర్రి రామారెడ్డి, డాక్టర్ గోలి రామారావు, ఉపాధ్యక్షులు రాఘవరెడ్డి, తారక రాము, భాను ప్రసాద్, శేషగిరి పాల్గొన్నారు.

అవగాహన అవసరం

రాజమహేంద్రవరం సిటీ: పర్యావరణంపై విద్యార్థి దశ నుంచే అవగాహన పెంచుకోవాలని రైల్వే అసిస్టెంట్ డివిజనల్ ఇంజినీర్ దడి ప్రసాద్ పిలుపునిచ్చారు. సౌత్ సెంట్రల్ రైల్వే స్కౌట్స్ అండ్ గైడ్స్ రాజరాజ నరేంద్ర ఓపెన్ గ్రూప్, గోదావరి ఓపెన్ గ్రూప్ రాజమహేంద్రవరం విభాగం ఆధ్వర్యంలో ఈస్ట్ రైల్ కాలనీ తదితర ప్రాంతాల్లో బుధవారం దాదాపు వంద మొక్కలు నాటారు.


శాటిలైట్ సిటీ హైస్కూల్లో మొక్క నాటుతున్న డీఎస్ఈవో వాసుదేవరావు, సుభాషిణి తదితరులు


కోర్టు ప్రాంగణంలో మొక్క నాటుతున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి గంధం సునీత

జిల్లా కోర్టులో..

కంబాలచెరువు: జిల్లా కోర్టు ప్రాంగణంలో బుధవారం పర్యావరణ దినోత్సవం నిర్వహించారు. జిల్లా ప్రధాన న్యాయమూర్తి గంధం సునీత, ఢిల్లీ నుంచి వచ్చిన ఎంసీపీసీ సీనియర్ ట్రైనర్లు వినయ్ గుప్తా, సునీల్ కుమార్ అగర్వాల్ తదితరులు కోర్టు ప్రాంగణంలో మొక్కలు నాటారు. న్యాయమూర్తి గంధం సునీత మాట్లాడుతూ పర్యావరణ రక్షణ అందరి బాధ్యత అన్నారు. మొక్కలు నాటడంతో పాటు వాటిని సంరక్షించే బాధ్యత తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో పర్మినెంట్ లోక్ అదాలత్ చైర్మన్ ఎ.గాయత్రీదేవి, న్యాయమూర్తి ఎన్.శ్రీలక్ష్మీ, టి.వీరేంద్రనాథ్, పి.రమేష్ పాల్గొన్నారు.

ఆర్ట్స్ కళాశాలలో...

రాజమండ్రి ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాలలో వృక్షశాస్త్ర విభాగం ఆధ్వర్యంలో ప్రపంచ పర్యావరణ దినోత్సవం నిర్వహించారు. ప్రిన్సిపాల్ రామచంద్ర ఆర్‌కే మాట్లాడుతూ తూర్పు, పశ్చిమ కనుమలలోని వృక్షజాతులను కళాశాలలో నాటడం జరిగిందన్నారు. వృక్షశాస్త్ర విభాగం ఇన్‌చార్జి డాక్టర్ ఎ.శ్రీనివాసరావు మాట్లాడుతూ రానున్న రోజులలో అనేక రకాల అటవీ వృక్షజాతులను కళాశాలలో నాటి సంరక్షిస్తామన్నారు. కార్యక్రమంలో కళాశాల ఐక్యూ ఏసీ విభాగ సమన్వయ కర్త డాక్టర్ ఎ.అన్నపూర్ణ, ఇతర అధ్యాపకులు పాల్గొన్నారు.

వృద్ధులకు పింఛన్ల పంపిణీ


వృద్ధులకు పింఛన్ అందజేస్తున్న క్లబ్ సభ్యులు

సీటీఆర్ఐ: వాకర్స్ యోగా లాఫింగ్ క్లబ్ స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో స్థానిక ఎస్‌కేవీటీ డిగ్రీ కళాశాలలోని ఆనందా గార్డెన్స్‌లో బుధవారం వృద్ధులకు పింఛన్లు పంపిణీ చేశారు. క్లబ్ అధ్యక్షుడు శనపతి సత్తిబాబు అధ్యక్షతన ఈ కార్యక్రమం జరిగింది. పర్యావరణ దినోత్సవం సందర్భంగా డిస్ట్రిక్ట్ గవర్నర్ శివాజీ మొక్కలు నాటారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వాకర్స్ ఇంటర్నేషనల్‌లో వాకర్స్ యోగా లాఫింగ్ క్లబ్ అనేక సేవా కార్యక్రమాలు నిర్వహించడం ఆనందంగా ఉందన్నారు. డిస్ట్రిక్ట్ కేబినెట్ కార్యదర్శి సత్యనారాయణ మాట్లాడుతూ కందుకూరి వీరేశలింగం పంతులు నడయాడిన నేలలో క్లబ్ చేస్తున్న సేవా కార్యక్రమాలు అద్భుతంగా ఉన్నాయని కొనియాడారు. ముఖ్య అతిథుల చేతుల మీదుగా ఒక్కొక్కరికి రూ.500 చొప్పున మొత్తం 80 మంది వృద్ధులకు రూ.40 వేలు వృద్ధాప్య పింఛన్లుగా అందజేశారు. ముఖ్య అతిథులను క్లబ్ సభ్యులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో క్లబ్ వ్యవస్థాపకుడు పామర్తి గోపాలరావు, ఎంజీఎఫ్ సిల్వర్ డోనర్ డిస్ట్రిక్ట్ గవర్నర్ చదరం శివాజీ, ఎంజీఎఫ్ సిల్వర్ డోనర్ డిస్ట్రిక్ట్ కార్యదర్శి కుందెం సత్యనారాయణ, క్లబ్ కార్యదర్శి గుబ్బల గంగా భవాని పాల్గొన్నారు.

రైతులకు వరి వంగడాల పంపిణీ

రాజానగరం: దివాన్ చెరువులోని ఏరువాక కేంద్రం ద్వారా జిల్లాలోని రైతాంగానికి నూతన వరి వంగడాలను సరఫరా చేస్తున్నారు. ఇందులో భాగంగా బుధవారం రంగంపేట మండలంలో కొందరు రైతులకు ఖరీఫ్ సాగుకు వరి వంగడాలను పంపిణీ చేశామని ఆ కేంద్రం కో ఆర్డినేటర్ డాక్టర్ చల్లా వెంకట నరసింహారావు తెలిపారు. ఎంటీయూ 1271, 1275, 1310, బీపీటీ 3082, 2858, 2841 వంటి నూతన వరి వంగడాలను వివిధ రకాల పరీక్షలు చేసిన అనంతరం రైతులకు అందజేశామన్నారు. తెగుళ్లను తట్టుకోవడంతో పాటు అధిక దిగుబడులను అందించడానికి ఇవి తోడ్పడతాయని చెప్పారు. అంతేగాక బీపీటీ 2841 వంటి నల్లబియ్యం రకాలను, పోషక విలువలు కలిగిన రకాలను సాగులో ప్రోత్సహించాలన్నారు. కార్యక్రమంలో ప్రధాన శాస్త్రవేత్తలు పి.అమ్మాజీ, డాక్టర్ ఎస్.హైమజ్యోతి, వ్యవసాయాధికారి కే.శ్రీనివాస్, వీఏఏ మహేష్, రైతులు పాల్గొన్నారు.

మలేరియాను అశ్రద్ధ చేస్తే ప్రాణాపాయం

సీతానగరం: మలేరియాను అశ్రద్ధ చేస్తే అది మెదడుకి సోకి ప్రాణాపాయం సంభవించవచ్చని పీహెచ్‌సీ డాక్టర్ ఏవీకే చైతన్య హెచ్చరించారు. మలేరియా వ్యతిరేక మాసోత్సవం సందర్భంగా సీతానగరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో బుధవారం ఆయన ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. డాక్టర్ చైతన్య మాట్లాడుతూ దోమల వృద్ధికి కారణమయ్యే నీటి నిల్వలను ఇంటి లోపల, బయటా లేకుండా జాగ్రత్త పడాలన్నారు. పాత టైర్లు, కొబ్బరి డొక్కలు, చిప్పలు, రోళ్లు, ఇతర ప్లాస్టిక్ డబ్బాలలో నీటి నిల్వలు లేకుండా చూసుకోవాల్నారు. నీటి కుండీలు, పూల కుండీలలో నీటిని మూడు రోజులకు ఒకసారి మార్చాలన్నారు.

జీడి పండు.. పోషకాలు మెండు

- అనేక ఔషధ గుణాలు
- పచ్చళ్లు, జ్యూస్‌లు తయారు చేసుకునే అవకాశం
- మహిళలకు శిక్షణ ఇస్తున్న కేవీకే

రాజానగరం: మెట్ట ప్రాంత రైతులకు అధిక ఆదాయం సమకూర్చే పంటలలో జీడిమామిడి ప్రధానమైనది. వేసవి పంటగా రైతులకు ఫలసాయాన్ని, ప్రభుత్వాలకు విదేశీ మారక ద్రవ్యాన్ని అందిస్తుంది. ఈ పంటలో జీడిగింజల ద్వారానే రైతాంగానికి ఆదాయం వస్తుందనే విషయం అందరికీ తెలిసిందే. అందుకనే దేశంలో జీడిమామిడి సాగు ఎక్కువగా జీడిగింజల కోసమే అన్నట్టు ఉంటుంది. దీంతో జీడిమామిడి పండ్లను మాత్రం పెద్దగా పట్టించుకోరు. తోటల్లో చెట్ల కిందనే అవి రాలిపోయి కుళ్లిపోతూ కనిపిస్తాయి. ఇలా దేశంలో సాలీనా 40 లక్షల టన్నుల జీడిమామిడి పండ్లు తోటల్లో వృథా అవుతున్నాయని నివేదికలు తెలియజేస్తున్నాయి.

జీడిపండ్లలో ఔషధ గుణాలు

మంచి రంగు, రుచి, ఘాటైన వాసన కలిగిన జీడిమామిడి పండు తినగానే గొంతులో ఒక రకమైన జీర కలిగి వుండటం వల్ల చాలామంది దీనిని తినడానికి ఆసక్తి చూపించరు. అలాగే ఒకటి, రెండు రోజులకు మించి నిల్వ చేసుకునేందుకు అవకాశం లేకపోవడం, త్వరగా కుళ్లిపోయే స్వభాగం కలిగి ఉండడంతో జీడిమామిడి పండ్లు తోటల్లోనే రాలిపోతూ, భూమిలోనే కలిసిపోతున్నాయి. వాస్తవానికి వీటిలో అనేక రకాల పోషక విలువలు, ఔషధ గుణాలు ఉన్నాయి. వీటి వినియోగంపై దేశవ్యాప్తంగా ఉన్న కృషి విజ్ఞాన కేంద్రాలు (కేవీకేలు) గ్రామీణ రైతు మహిళలకు శిక్షణ ఇస్తూ, కుటీర పరిశ్రమగా అభివృద్ధి అడుగులు వేసేందుకు కృషి చేస్తున్నాయి.

పలు రకాల ఆహార ఉత్పత్తులు

జీడిమామిడి పండ్లతో పలు రకాల ఆహార పదార్థాలను తయారు చేసుకోవచ్చు. వీటి రసంతో శీతల పానీయాలు, గుజ్జుతో జామ్, మిక్స్‌డ్ ఫ్రూట్ జామ్, చట్నీ, ఊరగాయ, క్యాండీ, టూటీ ఫ్రూటీ, టాఫీ, వినిగర్, చాకెట్లు (టాఫీలు), చాకెట్ బార్లు, మున్నగు వాటిని తయారు చేయవచ్చు. గోవాలో అత్యంత ఫేమస్‌గా లభించే ఫెన్నీ అనే మత్తు పానీయం జీడిమామిడి పండ్ల రసం నుంచే తయారవుతుంది.



రసం తీసే విధానం

బాగా ముగ్గిన జీడిమామిడి పండ్లను సేకరించి, నీటితో శుభ్రం చేసిన తరువాత చేతులతో గానీ, ప్రత్యేక మెషీన్‌లో గానీ వేసి రసాన్ని తీస్తారు. ఇందుకోసం జ్యూస్ ఎక్స్‌ట్రాక్టర్‌ను ఎక్కువగా ఉపయోగిస్తుంటారు. దీనివల్ల పండు నుంచి 70 శాతం రసాన్ని తీయడమే కాకుండా గంటకు 150 కిలోల పండ్ల రసాన్ని తీసేందుకు అవకాశం ఉంటుంది. ఈ రసంలో ఉన్న టెనిన్స్‌ని (గొంతులో జీరను కలిగించే వగరు) తొలగించడానికి సగ్గు బియ్యంతో తయారు చేసిన గంజిని ఉపయోగిస్తుంటారు. రసం తీయగా మిగిలిన గుజ్జుతో జామ్, మిక్స్‌డ్ ఫ్రూట్ జామ్, చట్నీలు తయారు చేయవచ్చు. జీడిమామిడి పండ్లతో మామిడి కాయల మాదిరిగా ఆవకాయ పెట్టవచ్చు. తీరిక సమయంలో తినేందుకు పొటాటో చిప్స్ మాదిరిగా చిప్స్ కూడా తయారు చేసుకోచ్చు.


జీడిమామిడి పండ్లతో తయారుచేసిన రసం, పచ్చడి


కలవచర్లలోని కేవీకేలో జీడిమామిడి పండ్ల వినియోగంపై శిక్షణ పొందుతున్న మహిళలు

పిప్పితో ఉపయోగాలు

- జీడిమామిడి పండు నుంచి రసం తీసిన తరువాత వచ్చే పిప్పిని ఎండబెట్టి పశువులకు, కోళ్లకు దాణాగా ఉపయోగించుకోవచ్చు.
- వర్మీ కంపోస్టుగానూ వినియోగించుకునే అవకాశం ఉంది. ఈ కంపోస్టులో 1.60 శాతం నత్రజని, 0.44 శాతం భాస్వరం, 0.58 శాతం పొటాషియం ఉంటాయి.
- గోవాలో ఈ పిప్పిని లిక్కర్ తయారీకి ఇంధనంగా వాడతారు.
- ఈ పిప్పి నుంచి పెక్టిన్ అనే ముఖ్యమైన ఉత్పత్తిని తయారుచేయవచ్చు. ఇది జామ్, చాస్, జెల్లీ, కెచప్ తయారీలలో చిక్కదనం రావడానికి తోడ్పడుతుంది. పలు రకాల మందులు, పౌడర్లు, పేస్టుల తయారీలోనూ వినియోగిస్తారు.

అనేక రోగాలకు ఔషధం

- జీడిమామిడి పండులోని సి విటమిన్ నిమ్మ జాతుల కంటే సుమారు 5 రెట్లు అధికంగా ఉంటుంది. పసుపు, ఎరుపు, గులాబీ రంగులలో దొరికే ఈ పండ్లలో 85 శాతం రసం, 10 శాతం చక్కెర ఉంటాయి. రసంలో ఫ్రక్టోజు, గ్లూకోజు, సుక్రోజు, మాల్టోజు, మాలిక్ ఆమ్లం ఉంటాయి.
- ఉదర సంబంధ వ్యాధులైన జిగట, నీళ్ల విరోచనాల నివారణకు, స్కర్వీ వ్యాధిని అరికట్టడానికి బాగా ఉపయోగపడుతుంది.
- మూత్ర పిండాల సమస్యలు, కలరా, డ్రాప్సీ వ్యాధి నివారణకు కూడా ఉపకరిస్తుంది. జీడిమామిడి పండు ఆరగించడం ద్వారా అరికాళ్ల పగుళ్లను కూడా నివారించవచ్చు.
- జీడిమామిడి రసంతో తయారుచేసిన ఫెన్నీ అనే మత్తు పానీయం పెద్దలకు, పిల్లలకు సంబంధించిన అనేక వ్యాధుల నివారణకు ఉపయోగపడుతుంది.
- వీటి విత్తనాలతో తయారు చేసిన పొడి పాము కాటుకు విరుగుడుగా కూడా ఉపయోగిస్తుంటారు.

పోషక విలువలు



జీడిమామిడి పండు అనేక రకాల పోషక విలువలు ఉన్నాయి. కృషి విజ్ఞాన కేంద్రం ద్వారా జీడిమామిడి పండ్లతో రసాలు, జ్యూస్‌లు, జామ్‌లను తయారు చేసే విధానంపై గ్రామీణ ప్రాంత మహిళలకు శిక్షణ ఇస్తున్నాం. వీటితో ఆవకాయ పచ్చడి కూడా పట్టుకోవచ్చు.

– డాక్టర్ వీఎస్‌జీఆర్ నాయుడు, ప్రధానాధికారి, కృషి విజ్ఞాన కేంద్రం, కలవచర్ల

750 మందికి శిక్షణ



ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో సుమారు 30 వేల హెక్టార్లలో జీడిమామిడి తోటలు విస్తరించి ఉన్నాయి. ఇక్కడ జీడిమామిడి గింజలు తీసుకుని, పండ్లను తోటల్లోనే వదిలేస్తుంటారు. కేరళ, గోవా రాష్ట్రాలలో మాదిరిగా జీడిమామిడి పండ్లను కూడా వినియోగం లోకి తీసుకువచ్చేందుకు కేవీకేలో ఆరేళ్లుగా 750 మంది మహిళలకు శిక్షణ ఇచ్చాం.

– జీవీఆర్ సత్యవాణి, గృహ విజ్ఞాన విభాగం అధికారి, కేవీకే, కలవచర్ల

నిరుద్యోగ యువతకు ఉపాధి

ఫుడ్ ప్రాసెంగ్ యూనిట్ల ద్వారా జీడిమామిడి పండ్లను ఉపయోగంలోకి తీసుకువచ్చే ప్రాసెస్ చేపడితే రాష్ట్రంలోని మెట్ట ప్రాంతాలలో నిరుద్యోగ యువతకు ఉపాధిని చూపవచ్చు. ఈ పండ్ల నుంచి తీసిన రసాన్ని యాప్పీ, ఫ్రూటీ, మాజాల మాదిరిగా టెట్రా ప్యాకింగ్ చేసి విక్రయించే ప్రక్రియ ద్వారా యువతకు ఉపాధి లభిస్తుంది. కేరళలో ఇప్పటికే జీడిమామిడి పండ్లతో తయారుచేసిన రసాన్ని శీతల పానీయంగా విక్రయిస్తున్నారు.